క్లుప్తంగా

సకాలంలో కుల గణన సర్వే

కొల్లిపర: మండలంలో కుల గణన సర్వేను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ వి.విజయలక్ష్మి ఆదేశించారు. గురువారం కులగణన సర్వేను ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే వివరాలను తెలుసుకున్నారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పకడ్బందీగా వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సక్రమంగా చెత్త సేకరణ



తెనాలిఅర్బన్: చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ఆదేశించారు. 22వ వార్డులో గురువారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను మూడు బుట్టల విధానంలో సేకరించాలని సూచించారు. అలాగే వార్డులో జరుగుతున్న మురుగు కాల్వల పూడిక తీత పనులు పరిశీలించారు. ఆమె వెంట 22వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ ఉన్నారు.

జొన్న, మొక్కజొన్నలో గులాబి రంగు పురుగు

తెనాలిటౌన్: రబీలో సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న పంటల్లో గులాబి రంగు పురుగు ఆశించినట్లు మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్ తెలిపారు. తెనాలి రూరల్‌లో సాగు చేస్తున్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. కొన్ని గ్రామాల్లోని పొలాల్లో అక్కడక్కడా కాండం తొలుచు పురుగు, గులాబి రంగు పురుగు ఆశించినట్లు గమనించామని తెలిపారు. నివారణకు పొలంలో కలుపు లేకుండా చూడాలని, పురుగు ఆశించిన మొక్కను పీకి వేయాలని సూచించారు. పైరులో 10 రోజుల వ్యవధిలో మందులు పిచికారి చేయాలని సూచించారు.

కొనసాగుతున్న కుల గణన సర్వే



తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుల గణన సర్వే గురువారం తెనాలి పట్టణంలో అన్ని వార్డుల్లో కొనసాగింది. వార్డు వలంటీర్లు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి.. వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంటి సభ్యులలో ఒకరితో బయోమెట్రిక్ వేయిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

సీఐగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం



మంగళగిరి: పట్టణ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా మద్దెడు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు చేపట్టిన మల్లిఖార్జునరావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నియమితుడైన శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఐకు ఎస్‌ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కొల్లిపర: మండలంలోని 15 ఆర్బీకేల పరిధిలో రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ కె.వెంకటరావు పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 5,763 మంది రైతులు రైతు భరోసా పథకం ద్వారా రూ.7.78 కోట్ల లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ-క్రాప్ నమోదు ద్వారా సున్నా వడ్డీ, పంట రుణాలు, బీమా, నష్ట పరిహారం, గిట్టుబాటు ధర తదితర పథకాలు వర్తిస్తాయన్నారు.

ఎన్‌వీఆర్ కళాశాలలో కంటి వైద్య శిబిరం



తెనాలిఅర్బన్: ఎన్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని గురువారం కళాశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడలోని సంధ్యా హాస్పిటల్ వైద్యులు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అజయ్, వీఎస్‌ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్ర, కో-ఆర్డినేటర్ నాగార్జున పాల్గొన్నారు.

మంచి చేశామని భావిస్తేనే ఓటు వేయండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూన నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందని, ప్రభుత్వం మంచి చేసిందని మహిళలు భావిస్తే తమ పార్టీకి వచ్చే ఎన్నికలలో ఓట్లు వేయాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని గురువారం అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు డ్వాక్రా సంఘాల రుణ మాఫీ చేస్తామని ప్రకటించి, అమలు చేయలేదని విమర్శించారు. ఆ సమయంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహనరెడ్డి తాము అధికారంలోకి రాగానే రుణ మాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతలలో రుణ మాఫీ చేయటం జరిగిందన్నారు. ఒక్క తెనాలి పట్టణంలోనే ఆసరా కింద రూ.40 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. తమ ప్రభుత్వం చేయగలిగిన రుణ మాఫీని గత ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోయాయో ప్రజలు ఆలోచించాలని కోరారు. అందరు ఆలోచించి... వచ్చే ఎన్నికలలో మంచి వైపు అడుగులు వేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ అత్తోట నాగవేణిలు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటి వద్దకు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం డ్వాక్రా సంఘ సభ్యులకు నమూన నగదు చెక్కును అందజేశారు. సమావేశంలో కౌన్సిలర్లు గెడ్డేటి ఝాన్సీవాణి, ఆవుల కోటయ్య, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, యాతాటి అనిల్, మెప్మా సీఎంఎంలు మాధవరావు, అరుణ, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

29 నుంచి వేంకటేశ్వర వైభవోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బాల స్వామీజీ

తెనాలిటౌన్: కొత్త పేటలోని ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు గోవిందనామ జపయజ్ఞ పూర్ణాహుతి, వేంకటేశ్వర సప్తాహ వైభవోత్సవాలు నిర్వహించనున్నట్లు బాలస్వామీజీ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను గురువారం గ్రౌండ్ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. సాలిగ్రామ మఠం ట్రస్ట్, శ్రీవిద్యా పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలస్వామీజీ మాట్లాడుతూ తిరుమలలో శ్రీవారికి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఏ విధంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయో.. అదేవిధంగా ఏడు రోజులు వైభోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం శృంగేరి శారదా పీఠ ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్‌శాస్త్రి వేంకటేశ్వర వైభవ సప్తాహ ప్రవచనం ఉంటుందని తెలిపారు. మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ సాయి హరేరామ్, ఎం.రమణయ్య, కోన నాగేశ్వరరావు, రావూరి సుబ్బారావు, మానేపల్లి శివ, వుప్పల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

తెనాలిఅర్బన్: అనాథ శవానికి శ్రీ శివలింగేశ్వర భక్త బృందం సేవా సమితి ప్రతినిధులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రకాశం జిల్లా మార్టురుకు చెందిన నాగూర్‌వలి (58) గ్యాస్ పొయ్యిలు రిపేరు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తెనాలి బాలాజీరావుపేటలోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉంటున్న అతను అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు.. సేవా సమితికి విషయం చేరవేడయంతో.. సభ్యులు కుర్రా శ్రీను, మల్లెల వాసు, షేక్ మౌలాలి, పిన్నెలి రాఘవ, బంగారు పోతురాజులు బుర్రిపాలెం రోడ్డులోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల కార్యవర్గం



వివరాలు వెల్లడిస్తున్న అధ్యక్షుడు శ్రీనివాసరావు

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈ నెల 28న రామలింగేశ్వపేటలోని ఏ1 కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. గంగానమ్మ పేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కుర్రా జశ్వంత్, ఉపాధ్యక్షులుగా మల్లవరపు భరత్, షేక్ కరీముల్లా, ప్రధానకార్యదర్శులుగా ఉన్నం ప్రణీత్, పఠాన్ యాసిర్ ఖాన్, కోటా వినయ్‌కుమార్, తోకల సుధీర్, బత్తుల బాలగోపి, కార్యదర్శులుగా దేశబోయిన గోపిరాజు, చెంగలశెట్టి సాయినాథ, కనపర్తి సందీప్, భీమవరపు మల్లికార్జునరావు, నీలా విజయ్, జ్యోతుల శివ, షేక్ అజ్గర్‌అలీ, షేక్ అలిముద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా యర్రమల్లి సురేష్, చావలి జగదీష్, కోపల్లె వంశీ, భోగ్యం సుబ్బారావు, తమ్మా హరినాథరెడ్డి, పిల్లి కల్యాణరావు, కనపర్తి శశికుమార్, కుమ్మరి వెంకటరత్నం, చెన్నుబోయిన వెంగళరావును నియమించినట్లు తెలిపారు.

డిపో పరిధిలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

తెనాలిరూరల్: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలో గత రెండేళ్లలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని, జీరో యాక్సిడెంట్‌గా తెనాలి డిపోకు పేరు తీసుకురావాలని ఆర్టీసీ డ్రైవర్లకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు సూచించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా తెనాలి డిపోలోని డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో ఎంవీఐ గురువారం డిపో మేనేజర్ రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు సిగ్నల్స్‌ను గమనిస్తూ..బస్సులు నడపాలని చెప్పారు. బ్రేక్‌డౌన్ లేకుండా వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీస్ చేయాలని మెకానిక్‌లకు సూచించారు. మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ డ్రైవర్లు డ్యూటీ సమయానికి అర్ధ గంట ముందు వచ్చి వాహనాన్ని పూర్తిగా తనిఖీ చేసుకోవాలన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన



ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీపీ, తహసీల్దారు

తెనాలిఅర్బన్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 22వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జె.మహేష్ ఆదేశాల మేరకు కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. ఓటు అవసశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ మౌలాబీ, ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, పీఐ స్టాఫ్ సుబేదార్ అవతార్ సింగ్ చిలకా సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

కొల్లిపర: ఓటరు కార్డుకి ఆధార్ నంబరు అనుసంధానం చేసుకుంటే.. తప్పులు లేని ఓటరు జాబితా తయారవుతుందని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దారు జి.నాంచారయ్య స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో మహిళలకు మండలస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఓటరు చైతన్య ప్రతిజ్ఞ చేయించి, ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, ఏఎస్ఓ మనోహరరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కోటి నాగకిరణ్ , కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొనఆనరు.

అలరించిన రామదాసు కీర్తనలు



తెనాలిటౌన్: పట్టణంలోని తులసీరామ్ చౌక్‌లో ఉన్న సీతా రామందిరంలో గురువారం వి.లక్ష్మీసునీత ఆధ్వర్యంలో మహిళలు, భక్తులు రామదాసు కీర్తనలు ఆలపించారు. కొద్ది రోజులుగా భద్రాచలం శ్రీరాముని నవరత్న, రామదాసు కీర్తనలను శిష్య బృందం సభ్యులు ఆలపిస్తున్నట్లు సునీత తెలిపారు. ప్రతి నెలా శ్రీరాముని జన్మ నక్షత్రం రోజున సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రహదారి ప్రమాదాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న పోలీసు అధికారులు

మంగళగిరి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలను నివారించాలని అక్టోపస్ ఎస్పీ రవిచంద్ర అన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డు లో ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదం అంటే ఒక మనిషి మృతి చెందడం కాదని అతని మృతి వలన ఒక కుటుంబం అనాథగా మారుతుందని తెలుసుకోవాలన్నారు. మద్యపానం సేవించి వాహనాలు నడుపుతున్న కారణంగానే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రజల రక్షణ కోసమే రహదారి నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. రహదారి నిబంధనలపై ప్రజలు అవగాహన కలిగిఉండి వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీటీసీ కరీం, ట్రైనీ ఆర్వోలు మనోహర్, భరత్, ఎస్ గోపాల్, మంగళగిరి, తెనాలి ఎంఈఐలు వి విజయసారధి, రాఘవ, మల్లీశ్వరి, తోట రాఘవరావు, జి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కౌలు రైతు మృతి

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో లారీ ఢీకొని కౌలు రైతు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గురువారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెదకాకాని మండలం నంబూరుకు చెందిన అప్పారావు పెదవడ్లపూడిలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పొలం పని ముగించుకొని పెదవడ్లపూడి సెంటర్‌కు అప్పారావు దంపతులు చేరుకున్నారు. అప్పారావు రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొట్టిన లారీ డ్రైవర్ లారీ ఆపకుండా పరారయ్యేందుకు యత్నించగా స్థానికులు వెంటపడి కోకా కోలా కంపెనీ వద్ద లారీని ఆపి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ప్రమాద వివరాలు సేకరించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

మహిళపై కొడవలితో దాడి

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): పాత గొడవల నేపథ్యంలో పొలం నుంచి ఇంటికి వస్తున్న మహిళపై అదే గ్రామానికి చెందిన మరో మహిళ, తన భర్తతో కలసి దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోరంట్ల అప్పమ్మ, దిగళ నారాయణమ్మ కుటుంబాల మధ్య గతంలో వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పాత గొడవలు మనసులో పెట్టుకొని పొలం నుంచి గడ్డి కోసుకొని ఇంటికి వస్తున్న గోరంట్ల అప్పమ్మ పై దిగళ నారాయణమ్మ, ఆమె భర్త వెంకట లక్ష్మణరాజులు కలసి కొడవలి, గొడ్డలి కర్రలతో ఒక్కసారిగా దాడి చేశారు. ఈ దాడిలో అప్పమ్మ తల, చేతులపైన తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.కిశోర్‌బాబు తెలిపారు.

ఓటరు జాబితాపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న లక్ష్మీ కుమారి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే విడుదల చేశామని ఆ జాబితాలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే చేయించుకోవచ్చని మంగళగిరి మంగళగిరి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మీ కుమారి గురువారం తెలిపారు. తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళవారం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల వారికి నూతనంగా చేర్చిన ఓట్లు, తొలగించిన ఓట్లు, సరిచేసిన ఓట్లు, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన ఓట్ల జాబితాను లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ ఓటరు జాబితాను తయారు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందినట్లయితే ఓటును తొలగించుకోవాలని, ప్రతి ఓటరు ఎన్నికల అధికారికి సహకరించాలని కోరారు. అనంతరం ఓట్ల నమోదుపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం

మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలో మంగళగిరి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి లక్ష్మి కుమారి ఆధ్వర్యంలో గురువారం ఓటరు దినోత్సవంపై ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన, ఓటు హక్కు ప్రాధాన్యత గురించి వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కు విలువ, ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, బూత్ లెవల్ అధికారులు ఇతర ఎన్నికల అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. 35వ వార్డు అగ్నికుల క్షత్రియ వీధి-2లో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద విడుదలైన నిధులతో వీటిని చేపట్టినట్లు కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయి హరేరామ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్ బాబు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, ఎంఈ నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకలు బూరెల దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని 4వ వార్డులో పాలాద్రి కాల్వ నుంచి బుర్రిపాలెం వరకు రూ.83.70లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ డ్రెయిన్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. అలాగే బీసీ కాలనీలోని శ్రీకృష్ణ మందిరం నుంచి పెమ్మసాని పెట్రోలు బంక్ వరకు రూ.17.40లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డునూ ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్ తోట రఘురామ్, ఎంఈ నాగమల్లేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల ముక్తేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, పెచ్చింగ్ సుభాని పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బీబీజాన్

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నందులపేటలోని సచివాలయంలో గురువారం జరిగిన వైద్య శిబిరంలో జనరల్ ఓపీ-62, గైనిక్-36, జనరల్ మెడిసిన్-67, ఆప్తమాలజీ-66 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బీబీజాన్ తెలిపారు. డాక్టర్ వి.లిఖిత, డాక్టర్ టి.విసీల్, డీపీఎంఓ జంగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌలి, వినోద్, శ్రీకంత ఉమాకాంత్, పున్నారెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలి

ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: అధికరులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ శాఖల వారిగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పలు గ్రామాల్లో మురుగు నీరు పారుదలకు కాల్వలు తీయాలని పలువురు ఎంపీటీసీలు కోరారు. తహసీల్దారు నాంచారయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పట్టా పొంది, ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి త్వరలో ఇస్తుందన్నారు. నిబంధనలకు లోబడి ఉన్న అసైన్డ్ భూములను కూడా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ భూములుగా మార్పు చేస్తుందన్నారు. ఎంపీడీవో వి.విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, పరిపాలన ఏవో చంద్రమోహన్, ఈఓపీఆర్డీ పూర్ణ శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవకు లేదు కొలమానం.. దరికి సంక్షేమం



పట్టణంలోని 23వ వార్డుకు చెందిన పోరెడ్డి శాంతకుమారి తీవ్ర అనారోగ్యంతో కొత్తపేటలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆమె వైఎస్సార్ చేయూత లబ్ధిదారు. ఈ పథకం లబ్ధికి ఈకేవైసీ అప్‌డేట్ చేయాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో గడువు ముగుస్తుందనగా.. వార్డు వలంటీర్ లింగిశెట్టి శబరీష లబ్ధిదారురాలు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, వైద్యశాలకు వెళ్లి ఆమె వేలి ముద్ర తీసుకుని, ఈకేవైసీ అప్‌డేట్ చేయించారు. –తెనాలిరూరల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కొంత సమయం నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటీఎఫ్ నాయకులు ఎండీ గయాసుద్దౌలా, కె.సాంబశివరావు, బసవేశ్వరరావు, పి.సౌజన్య, ప్రదీప్‌చంద్ పాల్గొన్నారు.